అరటి సాగుపై ఆసక్తి

- లభిస్తున్న గిట్టుబాటు ధరలు
- మండలంలో విస్తరిస్తున్న అరటి తోటలు
- మండలంలో సుమారు 300 ఎకరాల్లో సాగైన అరటి

తాడిమర్రి: రాష్ట్రంలో అన్నదాతలకు సిరులు కురిపిస్తున్న పంటల్లో అరటి ఒకటి. ఒకప్పుడు అరటి సాగు చేసేందుకు రైతులు వెనుకడుగు వేయడం చూశాం. పెట్టిన పెట్టుబడులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేసేవారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అరటి సాగు తక్కువగా ఉండటంతో ఉత్పత్తి తగ్గింది. మార్కెట్‌లో ఒక్కసారిగా అరటి ధరలు రెట్టింపు అయ్యాయి. గత ఏడాదిగా అరటి పంటకు రైతులు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లభిస్తోంది. మండలంలో అరటి తోటలు బాగా విస్తరిస్తున్నాయి. నాయనపల్లి, తురకవారిపల్లి, దాడితోట, చిల్లవారిపల్లి గ్రామాల్లో అధిక మంది రైతులు అరటి పంటను సాగు చేస్తున్నారు. అయితే గత మూడేళుగా మండలంలో కురిసిన వర్షాలకు అడుగంటిన బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరిగాయి. దీనికి తోడు అరటి ధరలు అమాంతం పెరిగడంతో రైతులు అరటి వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. చిల్లకొండయ్యపల్లి, రామాపురం, కునుకుంట్ల, ఏకపాదంపల్లి, పుల్లానారాయణపల్లి తదితర గ్రామాల్లో కూడా రైతులు అరటి తోటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో సుమారు 300 ఎరకాల్లో అరటి సాగులో ఉంది.

పెరిగిన ధరలు..

మండలంలో సాగు చేస్తున్న అరటి పంట ధరలు అమాంతం పెరిగాయి. గత ఏడాది వరకూ టన్ను రూ.7 వేలు, రూ.8 వేలు పలికిన ధరలు.. గత రెండు నెలల నుంచి అమాంతం పెరిగాయి. టన్ను ధర రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకూ పలుకుతోంది. లాభాలు వస్తాయనే ఆశతో రైతులు అరటి సాగుకు శ్రీకారం చుడుతున్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మేలు..

అరటి సాగు చేసిన రైతులు పండిన పంటను మార్కెట్‌కు తరలించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక విస్తీర్ణంలో సాగు చేసిన రైతులు తమ పంటను ఢిల్లీ, చెన్నై తదితర మహానగరాలకు తీసుకెళ్తారు. చిన్న, సన్నకారు రైతులు మార్కెట్‌కు వెళ్లలేకపోతున్నారు. తమ పంటను సరిహద్దు నగరాలైన బెంగుళూరు, పావగడ తదితర పట్టణాలకు తరలించి విక్రయిస్తున్నారు.


దాడితోట వద్ద సాగు చేసిన అరటి

గిట్టుబాటు ధర కల్పించాలి



ఎన్నో ఒడిదుడుకులు, అవస్థలు పడి పండిస్తున్న అరటి పంటకు మంచి గిట్టుబాటు ధర కల్పించాలి. సాధారణంగా తోటలన్నీ కాపుకు వచ్చిన సమయంలో అరటి పంటకు గిట్టుబాటు ధర తక్కువగా ఉంటుంది. దీంతో కొంతమంది రైతులకు లబ్ధి చేకూరుతోంది. అరటి పంటకు స్థిరమైర గిట్టుబాటు ధర ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – సీ.సాయినాథ్ రెడ్డి, రైతు, దాడితోట

రాయితీ అందించాలి



అరటి పంట సాగు కోసం రైతులకు రాయితీ రుణాలు అందించాలి. రాయితీపై నాణ్యమైన మొక్కలను ప్రభుత్వమే సరఫరా చేయాలి. అలాగే ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలి. పంటకు మంచి గిట్టుబాటు ధర వచ్చే వరకు పంటను నిల్వ చేసుకోవడానికి కోల్డు స్టోరేజీ గిడ్డంగులు నిర్మించాలి. – గంగిరెడ్డిగారి నాగశివారెడ్డి, చిల్లవారిపల్లి, తాడిమర్రి

క్లుప్తంగా

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి


విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఎన్‌పీకుంట: బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఎంఈఓ–1 గోపాల్‌నాయక్ సూచించారు. సోమవారం ధనియానిచెరువు గ్రామంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, పోషక విలువలతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని అన్నారు. బడి బయటి పిల్లలను గుర్తించి బడిలో చేరే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోగాతిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వారపు సంత వేలం

నల్లచెరువు: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి సర్పంచ్ పంచరత్నమ్మ అధ్యక్షతన బుధవారం 3 గంటలకు వారపు సంత వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వసుంధర సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనాలనుకున్న వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో పూజలు


పూజలందుకున్న కాటికోటేశ్వర స్వామి

తాడిమర్రి: మండలంలో చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర స్వామి క్షేత్రంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి స్వామి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్న భక్తులు ముందుగా గదాగుండంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయం ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్రంథాలయంలో ఫర్నీచర్ అపహరణ

కొత్తచెరువు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో దొంగలు ఫర్నీచర్ అపహరించారు. ఆదివారం రాత్రి గ్రంథాలయంలోకి చొరబడి ఆఫీస్‌రూంలో ఉన్న స్వీపర్ మునీర్‌బాషాను బెదిరించి రూ.40 వేలు విలువ చేసే 24 ఇనుప కుర్చీలు, పది ఫైబర్ కుర్చీలు, నాలుగు సీలింగ్ ఫ్యాన్లు , మూడు ఐరన్ ర్యాక్‌లను ఎత్తుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న గ్రంథాలయాధికారి జయరామ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు. వచ్చిన ఫిర్యాదు మేరకు పలువురు అనుమానితులను విచారిస్తున్నట్లు సీఐ రాజారమేష్ తెలిపారు.

ఓంకారేశ్వరుడికి పూజలు


అలంకరణలో ఓంకారేశ్వర స్వామి

బత్తలపల్లి: మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు కేశవస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగను సద్వినియోగం చేసుకోండి


వేరుశనగ కాయలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్: కుటాగుళ్ల రైతు భరోసా కేంద్రంలో సోమవారం సబ్సిడీ విత్తన వేరుశనకాయలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ రైతులు సబ్సిడీ వేరుశనగకాయలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనకాయలను ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మహిళా నాయకురాలు పర్వీన్‌బాను, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ భైరవప్రసాద్, ఏఓ శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన మక్బూల్ అహ్మద్


అధినేత జగన్‌తో సమన్వయకర్త మక్బూల్

కదిరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్ కలిశారు. తాను హజ్ యాత్రకు వెళ్లడంతో ఇటీవల విజయవాడలో ఎమ్మెల్యే అభ్యర్థులతో నిర్వహించిన సమావేశానికి రాలేక పోయానని ఈ సందర్భంగా మక్బూల్ పార్టీ అధినేతకు తెలిపారు. అనంతరం ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనకు ఎవరెవరు సహకరించారనే విషయాన్ని అధినేతతో పంచుకున్నారు. నిత్యం పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని జగన్ ఆయనకు సూచించారు. కాగా కదిరికి వచ్చిన అనంతరం బి.ఎస్.మక్బూల్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో బిజీ బిజీగా గడిపారు. తాను కదిరిలో ఉంటూ నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. ముస్ముందు మంచిరోజులు వస్తాయని ఆయన కార్యకర్తలకు ధైర్యం చెప్పారు.

పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలి


ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ధర్మవరం అర్బన్: సాగులో ఉన్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో రైతులు ప్రభుత్వ భూములను చదును చేసుకుని సాగు చేసుకుంటూ అనేక సంవత్సరాలుగా ఉపాధి పొందుతున్నారు. గతంలో అధికారులు సైతం సర్వే నిర్వహించారన్నారు. కొన్ని ప్రాంతాల్లో అసైన్డ్ కమిటీ కూడా గుర్తించి లిస్టులో పేర్లను ప్రకటించడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతులకు సాగు చేస్తున్న భూములకు హక్కులు కల్పించి వారికి బ్యాంకుల ద్వారా రుణాలు పొందే సౌకర్యం, పంటలు నష్టపోతే ఇన్సూరెన్స్ పొందే అవకాశం కల్పించి రైతులను ఆదుకోవాలని తెలిపారు. అనంతరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోలేపల్లి ముత్యాలప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప, నాయకులు బండల వెంకటేష్, నాగభూషణం, రైతులు ధనుంజయ, సూర్యనారాయణ, పరమేష్ పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

హిందూపురం: పట్టణానికి చెందిన యువ న్యాయవాది రాజ్ సంపత్ కుమార్‌ను హత్య చేసిన ప్రధాన నిందితులను అరెస్టు చేయాలి. అతని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం పుట్టపర్తిలోని కలెక్టర్, ఎస్పీ ఆఫీసుల వద్ద హిందూపురం రాజకీయ పార్టీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఈ ఏడాది మే 30న దారుణ హత్యకు గురయ్యాడని, హత్యకేసులో ప్రధాన నిందితులను నేటికీ అరెస్టు చేయలేదని నాయకులు విమర్శించారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హిందూపురంలో ఇటీవల హత్యా రాజకీయాలు, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని, వాటిని నివారించాలని కోరుతూ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి చెందుతున్న పురంలో గత ఏడాది వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి, ఇటీవల న్యాయవాది సంపత్ హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి పురం వాసులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యాంకిరణ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కదిరేష్, ఉపేంద్ర, కలీం, హనుమంతు, అంజి, జియా, ఫిరోజ్, సలాం, షఫీ, బీఎస్పీ నాయకులు శ్రీరాములు, హరి, ఆర్ఎస్‌పీ నాయకులు శ్రీనివాసులు, తిమ్మక్క, ఎంఎస్ఎఫ్ నాయకులు రవికుమార్, ఎస్‌పీ నాయకులు థౌసిఫ్, మున్నా, షఫీ తదితరులు పాల్గొన్నారు.

మూడు గదుల వేలం పూర్తి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి పంచాయతీ ఆధినంలో ఉన్న ఐదు గదులకు సోమవారం రత్నగిరి పంచాయతీ కార్యాలయం ఆవరణలో వేలం పాటను నిర్వహించామని ఈఓఆర్డీ కృష్ణప్ప తెలిపారు. ఇందులో మూడు కాంప్లెక్స్ గదులకు ఒక్కొక్క గదికి నెలకు అద్దె రూపంలో రూ.1050 చెల్లించేందుకు వేలం పాట దక్కించుకున్నారన్నారు. మిగిలిన రెండు గదులు వేలం పాటను వాయిదా వేశామన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

అగళి: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతు భరోసా సిబ్బందితో ఏఓ శేఖర్‌నాయక్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శేఖర్ నాయక్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా రైతులకు 2,329 క్వింటాళ్ల విత్తన వేరుశనగను పంపిణీ చేశామన్నారు.

నేడు సంత మార్కెట్ వేలం

రొళ్ల: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం11 గంటలకు సంత మార్కెట్, బస్టాండ్ ఆవరణలో సుంకం వసూలు వేలం పాటను నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ కృష్ణప్ప తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.2 వేలు చొప్పున డిపాజిట్ చెల్లించాలన్నారు.

అన్నదాన సత్రం నిర్వహణకు విరాళం

లేపాక్షి: లేపాక్షిలో ఉన్న అన్నదాన సత్రం నిర్వహణకు హైదరాబాద్‌కు చెందిన బ్రాండిక్స్ కంపెనీ యజమాని దొరస్వామి, మమతరాణి, ఉమాదేవి అన్నదాన కమిటీ సభ్యులకు సోమవారం విరాళమిచ్చారు. రూ. 23,348 నగదును సభ్యులకు అందజేశారు. ఎస్ఐ గోపీ సిబ్బంది పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

పావగడ: తాలూకాలోని జంగమరహళ్లి గ్రామానికి చెందిన మాతృశ్రీ సేవా సమితి అధ్యక్షుడు హెచ్ లక్ష్మీనారాయణ స్థానిక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు వితరణ చేశారు. నీలమ్మనహళ్లి క్లస్టర్ కు చెందిన బుద్దారెడ్డిహళ్లి ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 7 వ తరగతి విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు అందించారు. అదే విధంగా దొడ్డహళ్లి, వైఎన్ హొసకోట క్లస్టర్లకు చెందిన పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. మొత్తం 3 క్లస్టర్లకు చెందిన 13 ప్రభుత్వ పాఠశాలలకు సుమారు వెయ్యికి పైగా నోటు పుస్తకాలు అందించారు. పేద విద్యార్థులకు తనవంతుగా విద్యా సామాగ్రి అందిస్తున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి కోసం పడిగాపులు


సచివాలయంలో కార్యదర్శి కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

నల్లచెరువు: మండల కేంద్రంలోని సచివాలయం–2లో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శి గత కొంత కాలంగా విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని గ్రామస్తులు సోమవారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రోజూ హాజరు పట్టీలో సంతకం చేసి తిరిగి వెళ్లిపోతున్నారని వాపోయారు. ఒక్కోరోజు ఫేస్ యాప్ ద్వారా హాజరు వేసి, రిజిస్టర్‌లో సంతకం చేయకుండా వెళ్తున్నారన్నారు. ఆయనలాగే పలువురు సచివాలయ సిబ్బంది కూడా ఉండడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి కదిరి పట్టణంలో ఫిజియోథెరపీ సెంటర్ నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని ఎంపీడీఓ రాజెమ్మ దృష్టికి తీసుకెళ్లగా విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

బసంపల్లిలో వైద్య శిబిరం


గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని బసంపల్లి గ్రామంలో సోమవారం 104 వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో షుగర్, బీపీతో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులు పంపణీ చేశారు. అలాగే పలువురు గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా నివాస ప్రాంతాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే అందులో దోమలు పెరిగి రోగాలు వ్యాప్తి చేస్తాయన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంపీహెచ్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న ఎంపీడీఓ మణి మంజరి

తాడిమర్రి: వర్షాకాలంతో సాధారణంగా వచ్చే డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మణి మంజరి వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పలు గ్రామాల్లో ప్రజలు డయేరియాకు గురై ప్రాణాలు పోయినట్లు తెలిపారు. గ్రామాల్లో వర్షాల కారణంగా తాగునీరు కలుషితమై ఆ నీటిని తాగిన ప్రజలకు డయేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలనిఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది, గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. అలాగా ఎక్కడైనా ప్రజలు వాంతులు, విరోచనాలకు గురైతే వెంటనే దగ్గర్లోని ఆస్పత్రిలో చేర్పి వైద్య చికిత్సలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హరిత, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మీ, సీహెచ్‌ఓ హేమలత, వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మడకశిరలో మోస్తరు వర్షం


మడకశిరలో వర్షం పడుతున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. ఇప్పటికే 35 శాతం మంది రైతులు వేరుశనగ విత్తనాలు విత్తుకున్నారు. తాజాగా కురిసిన వర్షంతో మిగతావారు విత్తు వేసుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

వేలం పాట నిర్వహించాలి

సోమందేపల్లి: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ వారపు సంతకు వేలం పాట నిర్వహించాలని కేవీపీఎస్ నాయకులు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. వేలం పాట జరపక మూడు నెలలు కావస్తోందని తద్వారా ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతోందన్నారు. గతంలో కాంట్రాక్టర్ వారానికి రూ.37 వేలు పంచాయతీకి కట్టేవాడని, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి వారం తక్కువ మొత్తంలో సుంకం రూపంలో పంచాయతీ సిబ్బంది కడుతున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే పాలక వర్గంలో కుల వివక్ష లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, మండల కార్యదర్శి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంజనా దేవి ఆరాధనోత్సవం


అలంకరణలో అంజనా దేవి విగ్రహం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కోనక్షేత్రం అభివృద్ధికి పరితపించిన పవిత్ర యోగినిమాత అంజనాదేవి ఆరాధనోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే గోపూజ, గంగపూజతో పాటు ధ్వజారోహణం చేపట్టారు. అనంతరం అంజనా దేవి విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భజన చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

గుడిబండ: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలనే లక్ష్యంతో విద్యాశాఖ 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సోమవారం మండల పరిధిలోని నాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్ల కార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎమ్‌సీ చైర్‌పర్సన్ కవితమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్ అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

తనకల్లు: 'నీట్' అక్రమార్కులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన తనకల్లులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైద్య విద్యను అభ్యసించాలనే విద్యార్థుల ఆశలను అడియాసలు చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించకూడదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఇంత జరిగినా ఏమీ పట్టనట్టు వ్యవహరించడం తగదని ధ్వజమెత్తారు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు ఆడుతున్న వారు ఎవరో నిగ్గు తేల్చాలన్నారు. వెంటనే నీట్ పరీక్షపై విచారణ జరిపి.. అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తోపు పారేసు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నరసింహ, ప్రజా సంఘాల నాయకులు వేమన్న, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మందుల పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుబ్బదాసు సత్రంలో సోమవారం నారాయణసేవలో భాగంగా శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే 400 మందికి ఉచితంగా భోజనం అందించారు.

క్షయ వ్యాధి నివారణకు టీకాలు


తాడిమర్రిలో వృద్ధుడికి టీకా వేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లోని వృద్ధులకు సోమవారం వైద్య సిబ్బంది క్షయ వ్యాధి నివారణకు టీకాలు వేశారు. తాడిమర్రి, దాడితోట, ఎం.అగ్రహారం, కునుకుంట్ల, నార్శింపల్లి, ఎం.అగ్రహారం, పెద్దకోట్ల, చిల్లవారిపల్లి, పిన్నదరి, చిన్నచిగుళ్లరేవు తదితర గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ క్షయ వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబ సభ్యులు, వృద్ధులు, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు బీసీజీ టీకాలు వేశారు. బీసీజీ టీకాలతో క్షయను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు, ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ, లక్ష్మీకాంతమ్మ, నాగలక్ష్మమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్ రెడ్డి, రంగనాయకులు పాల్గొన్నారు.

అర్జీలపై దృష్టి సారించండి

బత్తలపల్లి: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందే అర్జీలపై దృష్టి సారించి వాటిని వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 3 అర్జీలు అందినట్లు తెలిపారు. వాటిలో భూ కొలతలకు, పట్టాదారు పాసుపుస్తకం కొరకు, డీ పట్టా ఫారం ఇవ్వాలంటూ ఒక్కొక్క అర్జీ అందినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రతి అధికారి తప్పక హాజరై, ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఏపీఎం సుదర్శన్ రాజు, మండల ఇంజినీర్ రమణయ్య, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఎంఈఓ చాముండేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రమ్మలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పోతలయ్య మృతదేహం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఈనెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన పోతలయ్య తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. వివరాలు.. పోతలయ్య పోతలయ్య ద్విచక్ర వాహనంలో ధర్మవరం పట్టణానికి వచ్చాడు. తిరిగి గొట్లూరు గ్రామానికి వెళ్తుతుండగా బత్తలపల్లి వైపు వెళ్లే కారు వచ్చి టూవీలర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పోతలయ్య కాలు విరిగిపోయింది. చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే పోతలయ్యను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం పరిస్థితి విషమించడంతో బెంగళూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోతలయ్య ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. మృతుడికి భార్యతోపాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.